
SAMAYAM
epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 295 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 16 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



# ఉస్మానియాకు పూర్వ వైభవం తీసుకురావాలి


## ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరిన సీఎం రేవంత్

### ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మర్యాదపూర్వక భేటీ

- సిటీ కాలేజ్ పునరుద్ధరణకూ సహకరించాలని విజ్ఞప్తి
- మూసీని 'నైట్ ఎకానమీ' కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేక ఆహ్వానం

తెలంగాణ వారసత్వ సంపదను కాపాడుకోవడంలో అగా ఖాన్ ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే శాసనమండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించుకున్నామని గుర్తుచేశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా హాస్పిటల్ భవనాల పునరుద్ధరణతో పాటు మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో ఫౌండేషన్ భాగస్వామ్యం వహించాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా హాస్పిటల్ కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని చారిత్రక వారసత్వ సంపదగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించే 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరుకావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ఆహ్వానించారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్) 2



# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు 2
- 'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం
- రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం

# రూ.2 వేలు దాటితే యూపీఐ 'చార్జీలు'!



- చిన్న చెల్లింపులకు రుసుముల్లేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్

దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 4

# విమర్శలకు భయపడొద్దు



- సోషల్ మీడియాకు తలొగ్గొద్దు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

.. వివరాలు 2లో

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

నిజామాబాద్ సీపీ ఎదుట సుశీల రాణి లొంగుబాటు 2



# '22ఏ' అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి



- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- '30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి'
- 'ధరణి రక్షణ కవచం.. భూభారతి భూ హారతి' అంటూ విమర్శ
- అసైన్డ్ భూములపై ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ 3

'రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అక్రమాలన్నీ బయటపెడతాం'

# పసుపు నీళ్ల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

- నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దు
- పోలీసులకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు
- నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలి 2
- ఏడేళ్లలోపు శిక్ష సెక్షన్లపై కోర్టు ఆరా
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని సూచన



# అక్కడ ఘనం.. ఇక్కడ భయం

- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి



కర్ణాటక, మహారాష్ట్రల్లో తెలంగాణ విముక్తి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం భయంతో నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి స్కూటీ ర్యాలీని ఆయన ప్రారంభించి ర్యాలీలో బైక్ నడిపారు. 3



# దేశం నుంచి ఆశించడమే కాదు సేవ చేయండి

జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల పిలుపు

.. వివరాలు 4లో

# ఇదొక కపట నాటకం, బూటకపు ప్రకటన

'మసూద్‌పై రివార్డు పెంపుపై భారత్ తీవ్ర స్పందన 4



# రేపు హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి

తెలంగాణ విమోచన దినోత్సవానికి సీపీ రాధాకృష్ణన్
పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథి
విస్తృత ఏర్పాట్లు చేపట్టాలన్న సీఎస్ సంజయ్ జాజు



2

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచన
- అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు 2





# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..

**సుశీల రాణి లొంగుబాటు.. నిజామాబాద్ సీపీ ఎదుట సరెండర్**

**డివిజన్ కమిటీ సభ్యురాలిగా కీలక బాధ్యతలు**

**ఈ ఏడాది ఇప్పటివరకు 266 మంది లొంగుబాటు**

**అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు నెట్‌వర్క్ బలహీనమైందన్న పోలీసులు**

**తెలంగాణకు చెందిన మరో ముగ్గురు నేతలే అజ్ఞాతంలో ఉన్నట్లు వెల్లడి**

**నిజామాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి అలియాస్ లత, లలిత, రేలా, జ్యోతి లొంగిపోయారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఎదుట ఆమె అధికారికంగా లొంగిపోయారు. సుశీల రాణి లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు పార్టీ పునర్నిర్మాణ సామర్థ్యం మరింత దెబ్బతిందని, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం బలహీనపడటంలో ఇది కీలక పరిణామమని పోలీసు అధికారులు పేర్కొన్నారు. 2026లో తెలంగాణ పోలీసుల మావోయిస్టు వ్యతిరేక చర్యల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని అధికారులు వెల్లడించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం 266 మంది అజ్ఞాత మావోయిస్టులు హింసామార్గాన్ని వీడి లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు, సభ్యులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరితోపాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు. దీంతో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు తీవ్రంగా బలహీనపడిందని పోలీసులు చెబుతున్నారు. తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, జడె రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తూ అజ్ఞాతంలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. తెలంగాణకు చెందిన కీలక నేతల్లో ఈ ముగ్గురే అజ్ఞాతంలో మిగిలినట్లు పేర్కొన్నారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ మరింత బలహీనపడిందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఇంకా అజ్ఞాతంలో ఉన్నవారు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని హింసామార్గాన్ని వీడి సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# విమర్శలకు భయపడొద్దు

**సోషల్ మీడియాకు తలొగ్గొద్దు**

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** న్యాయవ్యవస్థపై సోషల్ మీడియానో లేదా ఇతర బాహ్య శక్తుల ప్రభావమో ఉండకూడదని, అలాగే విమర్శలకు న్యాయవ్యవస్థను అతీతంగా ఉంచడం కూడా సరికాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన 6వ రామ్ జెత్మలానీ స్మారక ఉపన్యాసంలో 'జస్టిస్ సీన్ టు బీ డన్: ట్రాన్స్‌పరెన్సీ అండ్ పబ్లిక్ ట్రస్ట్ యాజ్ పిల్లర్స్ ఆఫ్ ది లీగల్ సిస్టమ్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కోర్టుల పనితీరుపై వచ్చే నిర్మాణాత్మక విమర్శలు న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంచడానికి తోడ్పడతాయని, ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే పరిశీలనకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తీర్పు ప్రకటించడంతో పాటు దాని వెనుక ఉన్న కారణాలను కూడా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉండాలని, అప్పుడే పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అయితే పారదర్శకత పేరుతో కోర్టు వ్యవహారాలను సోషల్ మీడియా అభిప్రాయాల ప్రభావానికి వదిలేయకూడదని హెచ్చరించారు. కేసులో ఓడిపోయిన వ్యక్తి కూడా తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును ఇచ్చిన ప్రక్రియ న్యాయంగా జరిగిందని నమ్మినప్పుడే న్యాయవ్యవస్థపై నిజమైన విశ్వాసం ఏర్పడుతుందన్నారు. 1924 నాటి ఇంగ్లండ్ కేసు 'ఆర్ వర్సెస్ ససెక్స్ జస్టీసెస్'ను ఉదాహరణగా చూపిస్తూ.. న్యాయం జరగడం మాత్రమే కాకుండా అది న్యాయంగా జరిగినట్లు కనిపించడమూ అంతే ముఖ్యమని తెలిపారు. సామాన్యుడికి న్యాయం సులువుగా చేరేలా ఈ-కోర్టుల ప్రాజెక్టు, ఎలక్ట్రానిక్ సమన్లు, ఈ-సేవా కేంద్రాల వాహనాల ద్వారా సేవలను విస్తరిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు.

# పసుపు నీళ్ల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దు**

**పోలీసులకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 15(సమయం న్యూస్):** సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో చోటుచేసుకున్న 'పసుపు నీళ్ల' ఘటన కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసులో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. నిందితులకు చట్టపరమైన నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని స్పష్టం చేసింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో కాంగ్రెస్ నేతలు నిర్వహించిన నిరసన అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వివాదానికి దారితీసింది. దీనిపై కాంగ్రెస్ నేతలు, స్థానికులు ఫిర్యాదులు చేయడంతో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా విచారణ చేపట్టిన ధర్మాసనం పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించింది. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా అరెస్టులకు వెళ్లొద్దని స్పష్టం చేస్తూ.. నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది.

# ఉస్మానియా'కు పూర్వ వైభవం తీసుకురావాలి

**ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరిన సీఎం రేవంత్**

**ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మర్యాదపూర్వక భేటీ**

**సిటీ కాలేజ్ పునరుద్ధరణకూ సహకరించాలని విజ్ఞప్తి**

**మూసీని 'నైట్ ఎకానమీ' కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి**

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేక ఆహ్వానం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** హైదరాబాద్ వారసత్వ సంపద పరిరక్షణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం మరింత అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణలో ఫౌండేషన్ భాగస్వామ్యం కావాలని కోరారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్--5తో మంగళవారం సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వారసత్వ సంపద పునరుద్ధరణలో ఆ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకున్నామని, కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణలోనూ ఆ సంస్థ విశేషంగా పనిచేసిందని గుర్తుచేశారు.

**ఉస్మానియాను వారసత్వ సంపదగా..**

మూసీ నది పునరుజ్జీవానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సీఎం వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ప్రస్తుత ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న చారిత్రక భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నదిని నైట్ ఎకానమీకి అనువుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పకుండా హాజరుకావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను సీఎం ఆహ్వానించారు. వందకు పైగా దేశాల ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని చెప్పారు. 2047 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, దీనిని నెట్-జీరో సిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. విమానాశ్రయానికి 20 నిమిషాల ప్రయాణ దూరంలో ఇది ఉంటుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్‌కు చెందిన సంస్థ రూపొందిస్తోందని సీఎం తెలిపారు. మొత్తం విస్తీర్ణంలో 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నామని, అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే అక్కడ తమ కార్యకలాపాలను ప్రారంభించాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు**

**దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు**

**'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు**

**ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం**

**రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం**




**హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 15(సమయం న్యూస్):** సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, జలశక్తి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరైన ఇళ్లకు అదనంగా మరిన్ని ఇళ్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 'ఆవాస్ ప్లస్' మొబైల్ యాప్‌ను వినియోగించనున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హత ఉన్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రాథమికంగా రూ.1.20 లక్షలు, అదనంగా రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12 వేల సాయం ఉంటుందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని పెమ్మసాని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం 1.75 లక్షల ఇళ్లు కేటాయిస్తే 42 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది మరిన్ని ఇళ్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను రాబోయే 2-3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# రేపు హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి

**తెలంగాణ విమోచన దినోత్సవానికి రాధాకృష్ణన్**

**పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథి**

**ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌కు రాక**

**విస్తృత ఏర్పాట్లు చేపట్టాలన్న సీఎస్ సంజయ్ జాజు**

**ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్ష**





**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 17న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులతో సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న ఉదయం 8.30 గంటలకు ఉప రాష్ట్రపతి హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సంజయ్ జాజు ఆదేశించారు సమీక్ష సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

**డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచన**

**అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** పంతాలకు పోయి పదోన్నతులను కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన 37 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో పడింది. ఈ నేపథ్యంలో డీజీపీ ఆనంద్ చొరవ తీసుకుని తన కార్యాలయంలో సంబంధిత బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారికి వారం రోజుల సమయం ఇచ్చారు. 'కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు' అని డీజీపీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీజీపీతో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు తాము కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డీజీపీకి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన ఆయా బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీజీపీ ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై సంబంధిత అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



# ‘22ఏ’ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- ‘30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి’
- ‘ధరణి రక్షణ కవచం.. భూభారతి భూ హారతి’ అంటూ విమర్శ
- అసైన్డ్ భూములపై ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్
- ‘రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అక్రమాలన్నీ బయటపెడతాం’



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** లక్షల ఎకరాల భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామని, అయితే రెవెన్యూ మంత్రి కేవలం ‘సారీ’తో సరిపెట్టారని విమర్శించారు. తప్పు చేసింది అధికారులు కాదని, ప్రభుత్వమేనని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ‘ఇది భూభారతి కాదు.. భూ హారతి’ అని వ్యాఖ్యానించారు. అడ్డగోలు చర్యలను నిలిపివేసి ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు. అసైన్డ్ భూముల విషయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి వారికి యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయన్న తమ ఆరోపణలు భవిష్యత్తులో నిజమని తేలుతాయని పేర్కొన్నారు. ‘రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం’ అని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకు ఉందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను వారికి అంటగట్టి సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమ సభ్యులను సస్పెండ్ చేసిందన్నారు. సస్పెండ్ చేసినప్పటికీ తాము ప్రజల్లోనే ఉంటామని, ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటామని స్పష్టం చేశారు. 22ఏ అంశంతోపాటు ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను ప్రజల మధ్యకు తీసుకెళ్తామని చెప్పారు. 22ఏ వ్యవహారంపై న్యాయ విచారణ జరిగితే అందరికీ మంచిదేనని కేటీఆర్ అన్నారు. ‘తప్పు చేసింది ప్రభుత్వం.. శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు’ అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నామని, కోర్టులో తప్పకుండా న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కామన్ సివిల్ కోడ్‌పై ఇప్పుడే నిర్ణయం చెప్పాల్సిన అవసరం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# అక్కడ ఘనం.. ఇక్కడ భయం

- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(సమయం న్యూస్) :** కర్ణాటక, మహారాష్ట్రల్లో తెలంగాణ విముక్తి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం భయంతో నిర్వహించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి స్కూటీ ర్యాలీని ఆయన ప్రారంభించి ర్యాలీలో బైక్ నడిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ నిజాం సైన్యం, రజాకార్లు గ్రామాలపై పడి ప్రజల, హిందువుల ఆస్తులను లూటీ చేస్తూ జాతీయ జెండా ఎగరేసినవారిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతూ మహిళలను చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దురాగతాలకు వ్యతిరేకంగా తెలంగాణ ఆడబిడ్డలు ధైర్యంగా పోరాడి తరిమికొట్టారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జోక్యంతో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారని తెలిపారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న నేటి మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాలను నిర్వహిస్తున్నాయని, కానీ నిజాం పాలన ప్రధాన కేంద్రమైన హైదరాబాద్‌లోనే తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అమరవీరుల ఆత్మబలిదానాలు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ చారిత్రక వేడుకలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

### నాటి త్యాగాలను నేటి తరానికి తెలపాలి : రామచందర్ రావు

హైదరాబాద్ విముక్తి, భారత యూనియన్‌లో విలీనం వెనుక ఉన్న త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నా ఎంఐఎం భయం, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనిని నిరాకరిస్తున్నాయని మండిపడ్డారు. మహిళా శక్తి స్కూటీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం దిశగా అడుగులు వేస్తున్న సమయంలో హైదరాబాద్‌ను ప్రత్యేక రాజ్యంగా ఉంచి పాకిస్థాన్‌తో కలపాలని నిజాం కుట్ర పన్నారని విమర్శించారు. నిజాం, రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు క్రూర హింసను ఎదుర్కొన్నారని రామచందర్ రావు తెలిపారు. తెలంగాణ బిడ్డలు ఎంతో ధైర్యంతో పోరాడారని, ఎందరో జాతీయవాదులు ప్రాణత్యాగం చేశారని, నిజాంకు వ్యతిరేకంగా గళమెత్తిన షోయబుల్లా ఖాన్‌ను సైతం హత్య చేశారని తెలిపారు. ప్రజల అసాధారణ ధైర్యం, త్యాగాలు చరిత్రలో నిలిచిపోయేవి అయినా గత ప్రభుత్వాలు ఆ వారసత్వాన్ని గౌరవించడంలో, వారి పోరాట గాథను సమాజానికి తెలియజేయడంలో విఫలమయ్యాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల కృషితోనే కేంద్రం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నదని, తద్వారా ఈ ఉజ్వల చరిత్రకు సరైన గుర్తింపు దక్కిందని తెలిపారు. విమోచన సందేశాన్ని, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహిళా శక్తి స్కూటీ ర్యాలీని విజయవంతంగా నిర్వహించిన మహిళా మోర్చా బృందాన్ని, పాల్గొన్న ప్రతి ఒక్కరినీ రామచందర్ రావు అభినందించారు.

# ఉద్యోగులతో పెట్టుకున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం

- ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న కవిత
- 630 మండలాలకు ఎనిమిది మంది శాశ్వత ఎంఈవోలేనా అంటూ ప్రశ్న
- పీఆర్సీ, డీఏలపై స్పందన లేదని విమర్శ
- బోధనకు దూరం చేసే పనిభారం తగ్గించాలని డిమాండ్
- అధికారంలోకి వస్తే ఉద్యోగులకు సముచిత గౌరవమని హామీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఉద్యోగులు, ఉపాధ్యాయులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని వ్యాఖ్యానించారు. బాగ్‌లింగంపల్లిలో మంగళవారం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించిన సదస్సులో కవిత మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని చెప్పారు. ఉద్యోగులకు గౌరవం కల్పిస్తూ, వారు సంతోషంగా పనిచేసే వాతావరణం ఉండేలా విధానాలు రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కంటే ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తుచేశారు. రాష్ట్రంలోని 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది శాశ్వత మండల విద్యాధికారులు మాత్రమే ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందించాలంటే బలమైన విద్యా యంత్రాంగం అవసరమన్నారు. విద్యార్థుల వివరాలు, వివిధ రకాల నివేదికల పేరుతో ఉపాధ్యాయులపై అదనపు పనిభారం మోపుతూ వారిని బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సహకారం లేకుండా ఏ ప్రభుత్వ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయడం సాధ్యం కాదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా.. పింఛన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించడం లేదని కవిత విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ వారితో విభేదాలు పెంచుకోవడం ప్రభుత్వానికే నష్టమని పేర్కొన్నారు.



## నిరుద్యోగ యువతకు అండగా పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్

### కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్

**సమయం న్యూస్, ఖమ్మం:** పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో రైట్ ఛాయిస్ అకాడమీ నిర్వహణలో ఈ శిక్షణ కొనసాగుతోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పరీక్షా విధానానికి అనుగుణంగా బోధన అందిస్తున్నారు. ఎల్ఈడీ స్క్రీన్లపై డిజిటల్ తరగతులతో పాటు ప్రతిరోజూ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. లోపాలను గుర్తించి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నిరుద్యోగ యువతపై ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన కోచింగ్ అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జాబ్ ఫెయిర్‌ను వినియోగించుకోవాలి




**సమయం న్యూస్, ఆదిలాబాద్:** మహిళలు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకక అధ్యక్షుడు ఖ్వాజా సిరాజుద్దీన్ కోరారు. సేవా ఫౌండేషన్, స్కిల్ రూట్స్, యూనిసెఫ్ సహకారంతో బుధవారం మహిళల కోసం ఉచిత మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సాత్నాల రోడ్డులోని అర్పా గార్డెన్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జాబ్ ఫెయిర్ జరుగుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి బీఈ, బీటెక్, బీసీఏ, ఎంసీఏ విద్యార్హతలు ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హత, సామర్థ్యం, నైపుణ్యాల ఆధారంగా నెలకు రూ.15వేల నుంచి రూ.17వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. వివిధ కంపెనీల అధికారులు, ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ హాజరుకానున్నట్లు వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ లను వేర్వేరుగా కలిసి జాబ్ ఫెయిర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు షేక్ జావేద్, షేక్ ఇస్మాయిల్, అస్లమ్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, సమీర్ ఖాన్, రిజ్వాన్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, మోయిద్ ఖాన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16, బుధవారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనను మాజీ గవర్నర్లు సి. విద్యాసాగర్ రావు, బండారు దత్తాత్రేయ, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని కవర్ చేయాల్సిందిగా మీడియా ప్రతినిధులను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, హైదరాబాద్ ఆహ్వానించింది. కావాలంటే దీన్ని ఇంకా క్లుప్తంగా 4-5 లైన్ల వార్తగా కూడా ఇస్తాను.

## ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు కేటాయించిన కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు తదితర పత్రాలతో చేరాలని సూచించింది. అలాగే ఎంబీబీఎస్/బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపును కూడా విడుదల చేసింది. ఈ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు సంబంధిత కళాశాలల్లో అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ తెలిపింది. ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమైనట్లు పేర్కొంది.




# ఉద్యోగం పోయింది

## ఉదయం 6 గంటలకే మెయిల్!

**ఒరాకిల్‌లో మరో విడత భారీ లేఆఫ్స్**

**సమాచారం అందిన రోజే చివరి పనిదినం**

**కృత్రిమ మేధపై భారీగా పెట్టుబడులు**

**ఇప్పటికే 21 వేల మంది ఉద్యోగులకు కోత**

**ఓవైపు ఏఐ విస్తరణ.. మరోవైపు ఖర్చుల కత్తెర**

**న్యూయార్క్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** టెక్ ఉద్యోగులను 'లేఆఫ్స్' భయం వెంటాడుతూనే ఉంది. ఎప్పుడు ఉద్యోగం పోయిందంటూ ఈమెయిల్ వస్తుందో తెలియని పరిస్థితుల్లో తాజాగా అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో మరో విడత ఉద్యోగాల కోతలు మొదలైనట్లు సమాచారం. ప్రభావిత ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే ఈమెయిల్ పంపి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు తెలియజేసినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ నివేదించింది. సంస్థలో జరుగుతున్న విస్తృత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే తాజా కోతలు చేపట్టినట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి తాజా లేఆఫ్స్ మొదలైనట్లు సమాచారం. ఉద్యోగాలు కోల్పోయిన కొందరు లింక్డ్ఇన్, రెడిట్, బ్లైండ్ వంటి వేదికల్లో తమ అనుభవాలను వెల్లడించారు. ముగ్గురు ప్రభావిత ఉద్యోగులతో మాట్లాడడంతోపాటు సంస్థ పంపిన అంతర్గత నోటిఫికేషన్‌ను పరిశీలించినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ పేర్కొంది. సంస్థాగత మార్పుల్లో భాగంగా ఆయా ఉద్యోగుల పాత్రలను తొలగిస్తున్నట్లు ఉదయం అందిన ఈమెయిల్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాదు.. నోటిఫికేషన్ అందుకున్న రోజే చివరి పనిదినంగా నిర్ణయించినట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజా విడతలో మొత్తం ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారన్న విషయాన్ని మాత్రం ఒరాకిల్ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఒకవైపు ఉద్యోగులను తగ్గిస్తున్న ఒరాకిల్.. మరోవైపు కృత్రిమ మేధ, క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సంస్థ మూలధన వ్యయం 28.5 బిలియన్ డాలర్లకు చేరినట్లు పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో 8.5 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ వ్యయం ఏడాదిలో మూడు రెట్లకుపైగా పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 90 నుంచి 95 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలన్న అంచనాను కొనసాగిస్తోంది. ఒరాకిల్ ఏఐ వ్యాపారానికీ భారీ డిమాండ్ కనిపిస్తోంది. ఒక్క త్రైమాసికంలోనే 30 బిలియన్ డాలర్లకుపైగా అదనపు ఏఐ క్లౌడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో మిగిలిన పనితీరు బాధ్యతల విలువ 664 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే ఏఐ విస్తరణకు చేస్తున్న భారీ పెట్టుబడులు నగదు ప్రవాహంపై ప్రభావం చూపుతున్నాయి. త్రైమాసికంలో సంస్థ స్వేచ్ఛా నగదు ప్రవాహం 5.4 బిలియన్ డాలర్ల మేర ప్రతికూలంగా నమోదైంది. డేటా సెంటర్లపై వ్యయం భారీగా పెరుగుతున్న సమయంలో ఖర్చులను అదుపు చేసేందుకు ఉద్యోగాల కోతలూ కొనసాగుతున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### ఇప్పటికే 21 వేల ఉద్యోగాలకు కత్తెర

ఒరాకిల్‌లో ఈ ఏడాది ఉద్యోగాల కోతలు ఇదే తొలిసారి కాదు. 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21 వేల మంది ఉద్యోగులను తగ్గించినట్లు సమాచారం. ఇది మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. మే 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరికి సంస్థలో సుమారు 1.41 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, అంతకుముందు ఏడాది ఈ సంఖ్య దాదాపు 1.62 లక్షలుగా ఉంది. ఉద్యోగుల తొలగింపులు, ఇతర పునర్వ్యవస్థీకరణ చర్యలకు సంబంధించి 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ సుమారు 1.84 బిలియన్ డాలర్లను సెవరెన్స్, ఇతర ఎగ్జిట్ ఖర్చులుగా వెచ్చించినట్లు సమాచారం. అంతకుముందు ఏడాది ఈ వ్యయం 374 మిలియన్ డాలర్లుగా ఉంది. తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధను స్వీకరించడం, విస్తృతంగా అమలు చేయడం ఉద్యోగుల సంఖ్య తగ్గడానికి దోహదపడుతున్న అంశాల్లో ఒకటని ఒరాకిల్ గతంలో పేర్కొంది. ఇదే సమయంలో పునర్వ్యవస్థీకరణ వ్యయాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. తాజాగా అంచనా పునర్వ్యవస్థీకరణ ఖర్చులకు మరో 700 మిలియన్ డాలర్లు జోడించడంతో మొత్తం ప్రణాళిక వ్యయం దాదాపు 2.8 బిలియన్ డాలర్లకు చేరినట్లు సమాచారం. ఇందులో ఉద్యోగుల సెవరెన్స్, ఒప్పందాల రద్దు రుసుములు, ఇతర ఎగ్జిట్ ఖర్చులు ఉన్నాయి. ఆగస్టు 31 నాటికి ఈ ప్రణాళిక కింద దాదాపు 2.1 బిలియన్ డాలర్ల ఛార్జీలను నమోదు చేసినట్లు సంస్థ తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో అదనంగా 700 మిలియన్ డాలర్ల వ్యయాన్ని అంచనా వేసినట్లు పేర్కొంది.

### ముందే వినిపించిన 'సెప్టెంబర్ కోతలు'

సెప్టెంబర్‌లో ఒరాకిల్ మరో విడత ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతోందన్న వార్తలు గత నెలలోనే వెలువడ్డాయి. ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణ కోసం భారీగా నిధులు సమీకరిస్తున్న నేపథ్యంలో పేరోల్ ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించవచ్చన్న అంచనాలు వచ్చాయి. తాజా పరిణామాలతో ఆ కసరత్తు అమల్లోకి వచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఒరాకిల్ వ్యూహంలో ఇప్పుడు రెండు భిన్న చిత్రాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు భవిష్యత్ ఏఐ, క్లౌడ్ డిమాండ్‌ను అందిపుచ్చుకునేందుకు డేటా సెంటర్లపై భారీగా పెట్టుబడులు పెడుతుండగా.. మరోవైపు ఖర్చులను అదుపులో పెట్టేందుకు ఉద్యోగాలపై కత్తెర వేస్తోంది. టెక్ రంగంలో ఏఐ విస్తరణ వేగం పెరుగుతున్న కొద్దీ ఉద్యోగుల్లో 'తర్వాత మెయిల్ ఎవరికో?' అన్న ఆందోళన మరింత పెరుగుతోంది.




# రూ.2 వేల దాటితే యూపీఐకి 'చార్జీలు'!

- చిన్న చెల్లింపులకు రుసుముల్లేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి చెల్లింపులపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేటు విధించే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయంగా దుమారం రేపుతోంది. 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏ కింద ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ చట్టానికి సంబంధించిన సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఆగస్టు 13న సమావేశాలు ముగిసిన అనంతరం యూపీఐపై ఎండీఆర్ రేట్లకు సంబంధించిన అంశాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ పరిశీలిస్తుందని కేంద్రం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం లావాదేవీ మొత్తం ఎంత ఉన్నా సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ లేదు. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులకు ఎలాంటి రుసుము ఉండదని స్పష్టత వచ్చినప్పటికీ.. ఆ పరిమితి దాటిన వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్ ఎంత ఉండాలన్నది ఇంకా ఖరారు కాలేదని సంబంధిత వర్గాల సమాచారం. బ్యాంకులు, సేవల సంస్థల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీ స్వయం సుస్థిరత, మార్కెట్ విస్తరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. పెద్ద వ్యాపారి చెల్లింపులపై 0.3 నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్ ఉండొచ్చన్న ప్రచారం సాగుతున్నప్పటికీ అధికారిక రేటు ఇంకా ఖరారు కాలేదు. వారంలో నిర్ణయం వెలువడి అక్టోబర్ నుంచి అమల్లోకి రావచ్చన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. వ్యక్తి నుంచి వ్యక్తికి పంపుకునే నగదు బదిలీలపై మాత్రం ఈ రుసుము వర్తించదని, చర్చ ప్రధానంగా వ్యాపారులకు చేసే చెల్లింపులపైనేనని సమాచారం. బ్రెజిల్‌లోని పీఐఎక్స్ చెల్లింపు వ్యవస్థలో 0.33 శాతం, చైనాలోని చెల్లింపు వ్యవస్థల్లో సుమారు 0.40 శాతం మర్చంట్ రేటు ఉన్నట్లు పేర్కొంటున్నారు. భారత్‌లో ఎంత రేటు నిర్ణయిస్తారన్నది తేలాల్సి ఉంది.

### 'నిశ్శబ్దంగా మార్గం సుగమం చేశారు'



ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. యూపీఐపై ఫీజులు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని ఆరోపించారు. రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి లావాదేవీలు సంఖ్యాపరంగా స్వల్పమే అయినప్పటికీ మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జీ వసూలు చేయబోమని ప్రభుత్వం చెప్పినా వ్యాపారులపై పడే ఎండీఆర్ భారాన్ని వారు వస్తువులు, సేవల ధరల్లో కలిపే అవకాశం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమంగా ఆ భారాన్ని సామాన్య వినియోగదారులే భరించాల్సి వస్తుందని విమర్శించారు.

### 'మళ్లీ క్యాష్ వైపు మళ్లే ప్రమాదం'



యూపీఐపై చార్జీల ఆలోచనను భారత్‌పే సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ కూడా వ్యతిరేకించారు. విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థపై రుసుము విధించడం పరోక్ష పన్నులాంటిదేనని వ్యాఖ్యానించారు. రూ.2 వేల పరిమితిని ఎందుకు నిర్ణయించారన్నదే తన ప్రశ్న అని పేర్కొన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలు సంఖ్యాపరంగా దాదాపు 4 శాతమే అయినప్పటికీ మొత్తం లావాదేవీల విలువలో వాటి వాటా సుమారు 66 శాతమని గ్రోవర్ పేర్కొన్నారు. పెద్ద మొత్తాలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉందన్నారు. లేదంటే రూ.12 వేల చెల్లింపును రూ.2 వేల చొప్పున పలుమార్లు చేసే పరిస్థితులు ఏర్పడవచ్చని అభిప్రాయపడ్డారు. దుకాణదారులు రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులు తీసుకునేందుకు వెనుకాడి నగదు కోరే పరిస్థితి కూడా రావచ్చని హెచ్చరించారు. అలా జరిగితే నగదు వినియోగం పెరగడంతోపాటు మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాల అవసరం ఏర్పడుతుందని పేర్కొన్నారు. యూపీఐ వ్యవస్థకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంకు నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ పన్నుకు ముందు మిగులు రూ.1,888 కోట్లుగా ఉందని గుర్తుచేశారు. అయితే రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులకు చార్జీలు ఖరారయ్యాయని ఇప్పుడే భావించడానికి వీల్లేదు. ప్రస్తుతం చర్చలో ఉన్నది ప్రధానంగా వ్యాపారి చెల్లింపులపై ఎండీఆర్ విధించే అవకాశమే. రేటు, అమలు తేదీపై అధికారిక నిర్ణయం వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

## జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల పిలుపు

**దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి సాధించామని వెల్లడి**

**తమిళనాడులో ఉపాధి అవకాశాలు పుష్కలమని వ్యాఖ్య**



**చెన్నై, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** దేశం నుంచి మనం ఏం ఆశిస్తున్నామన్న దానికంటే.. దేశం కోసం మనం ఏం చేయగలమన్నదే యువత ఆలోచించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువత ఆకాంక్షలను వినేందుకు దేశం సిద్ధంగా ఉందని, అదే సమయంలో పౌరులుగా తమ బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని హితవు పలికారు. చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో మంగళవారం నిర్మల సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వ బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని పేర్కొన్నారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావించిన ఆమె.. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రత, స్థిరత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు.

### అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. తమిళనాడు పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు కీలక కేంద్రంగా ఎదిగిందన్నారు. ముఖ్యంగా శ్రీపెరంబుదూర్--ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకు అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు. కోయంబత్తూరు, మధురై నగరాల్లో ఏర్పాటైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని వివరించారు. విద్యతోపాటు వినయం ముఖ్యమని, అహంకారాన్ని వీడి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని యువతకు నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు.






# ఇదొక కపట నాటకం, బూటకపు ప్రకటన

**'గిమ్మిక్కులతో ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించొద్దు'**

**'మసూద్‌పై రివార్డు పెంపుపై భారత్ తీవ్ర స్పందన**

**మాటలు కాదు.. చేతల్లో చూపాలన్న విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజర్‌పై రివార్డును పెంచుతూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై భారతదేశం అత్యంత తీవ్రస్థాయిలో స్పందించింది. పాకిస్థాన్ ప్రకటనను 'కపట నాటకం' అని, ప్రపంచ దేశాల కళ్లలో దుమ్ముగొట్టేందుకు ఆడుతున్న బూటకపు గిమ్మిక్కు అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఉగ్రవాదానికి స్వర్గధామంగా మారిన ఒక దేశం నుంచి ఇలాంటి ప్రయోజనం లేని ప్రకటనలు రావడం కొత్తేమీ కాదని, కేవలం మాటలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకున్నప్పుడే దానికి ప్రాధాన్యత ఉంటుందని మంగళవారం మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) తమ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల 'రెడ్ బుక్ 2026' జాబితాలో మసూద్ అజర్ పేరును కొనసాగిస్తూ, అతనిపై ఉన్న రివార్డును మరో 20 లక్షల పాకిస్తానీ రూపాయలు పెంచి మొత్తం పీకేఆర్ 70 లక్షలకు (భారత కరెన్సీలో సుమారు రూ. 24 లక్షలు) చేర్చింది. వచ్చే అక్టోబర్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ప్లీనరీ సమావేశం జరగనున్న నేపథ్యంలో, మళ్లీ 'గ్రే లిస్ట్' ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి పాకిస్థాన్ ఈ తరహా నాటకానికి తెరతీసిందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు. మసూద్ అజర్ తమ దేశంలో లేడని, ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాడని పాక్ సాకులు చెబుతున్నప్పటికీ, ఆ ఉగ్రవాది పాక్ రక్షణలోనే సురక్షితంగా ఉన్నాడని భారత్ గట్టిగా వాదిస్తోంది.

# మర్రి ఆకు ఒడిగా... మట్టి గణపతి..

- ఆకుపై కొలువైన బాల గణపతి..
- 2 సెంటీమీటర్ల సూక్ష్మ గణపతితో పర్యావరణ పరిరక్షణ సందేశం
- 18 ఏళ్లు గా సూక్ష్మ గణపతులతో చైతన్యం.. జాతీయ అవార్డు గ్రహీత జయకుమార్ వినూత్న ప్రయత్నం





**నర్సంపేట, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** వినాయక చవితి అంటే భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతిపై బాధ్యతను గుర్తుచేసే పండుగ కూడా. మట్టి గణపతిని పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని తన సూక్ష్మ కళ ద్వారా చాటుతున్నారు నర్సంపేటకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత, మైక్రో ఆర్టిస్ట్, పర్యావరణ ప్రేమికుడు శ్రీరామోజు జయకుమార్. గత 18 ఏళ్లుగా ప్రతి వినాయక చవితికి వినూత్నమైన సూక్ష్మ గణపతి ప్రతిమలను రూపొందిస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న జయకుమార్ ఈ ఏడాది మరింత ప్రత్యేకమైన ఆలోచనకు రూపమిచ్చారు. కేవలం రెండు సెంటీమీటర్ల మట్టి గణపతిని మర్రి ఆకుపై (వటపత్రం) తీర్చిదిద్దారు.

**వటపత్ర గణపతికి ఉండ్రాళ్ల లాలి..**

'వటపత్ర గణపతికి ఉండ్రాళ్ల లాలి' అనే భావనతో రూపొందించిన ఈ సూక్ష్మ కళాకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మర్రి ఆకుపై మట్టి గణపతిని ప్రతిష్ఠించి చిన్నారిని తల్లి లాలించినట్లు గా గణపతికి ఉండ్రాళ్లతో లాలి పాడుతున్న భావనను కళాకృతిలో ఆవిష్కరించారు. సంప్రదాయ భక్తికి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని జోడించడం ఈ కళాకృతి ప్రత్యేకత. ప్రతి ఏడాది కొత్త ఆలోచనతో సూక్ష్మ గణపతులను రూపొందిస్తున్న జయకుమార్ మట్టి గణపతులనే పూజించాలి, ప్రకృతికి హాని కలిగించకుండా పండుగను జరుపుకోవాలి అనే సందేశాన్ని తన కళ ద్వారా ప్రజల్లో కి తీసుకెళ్తున్నారు.

**ప్రకృతిని కాపాడితే.. మనల్ని ప్రకృతి కాపాడుతుంది...**

ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అన్నారు. ప్రకృతిని నిర్ల క్ష్యం చేస్తే ఆ ప్రభావాన్ని భవిష్యత్ తరాలు అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, కరువులు, ప్రకృతి వైపరీత్యాలు మనకు ఎన్నో హెచ్చరికలు ఇస్తున్నాయని తెలిపారు. ప్రకృతితో మనిషి స్నేహంగా మెలగాలని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని కోరారు.

**కరువుకాటకాలు తొలగాలని, సమృద్ధిగా వర్షా లు కురవాలని వేడుకోలు...**

వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని.. కరువుకాటకాలు, ప్రకృతి విపత్తులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని వటపత్ర వక్రతుండుని ప్రార్థించినట్లు జయకుమార్ తెలిపారు. చిన్నదైన మట్టి గణపతి పెద్దదైన పర్యావరణ సందేశం అన్నట్లుగా తన సూక్ష్మ కళాకృతితో ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను చాటుతున్నారు. భక్తితో పాటు బాధ్యతను కలిపి వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# నిన్నటి వీరనారుల స్ఫూర్తి.. నేటి మహిళల సంకల్పం..

- మహిళా శక్తితో సమాజ ప్రగతి దిశగా అడుగులు
- మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం..మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవంలో ఎర్రబెల్లి స్వర్ణ, బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్




**హన్మకొండ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్) :** అఖిల భారత మహిళా కాంగ్రెస్ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని మహిళా కాంగ్రెస్ నాయకులు, అంకిత భావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ దేశ చరిత్రలో రజియా సుల్తానా, రుద్రమదేవి, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ వంటి ఎందరో మహిళలు తమ ధైర్యసాహసాలతో ప్రత్యేక ముద్ర వేశారని గుర్తుచేశారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసి మహిళా శక్తిని చాటిన వీరనారుల స్ఫూర్తితో నేటి మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 'కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలి' అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంతోపాటు వ్యాపార రంగంలో రాణించేలా ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఆర్టీసీలో మహిళా డ్రైవర్లు, మహిళా యాజమాన్యంలోని క్యాంటీన్లకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా మహిళలకు ఉపాధి, ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మహిళా కాంగ్రెస్ ముందుండి పనిచేస్తుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో మహిళల రాజకీయ, సామాజిక సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో మహిళా కాంగ్రెస్ ఏర్పాటైందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం మహిళా కాంగ్రెస్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళలు చురుకైన పాత్ర పోషించేలా సంస్థ స్ఫూర్తినిస్తోందన్నారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా మహిళల ఆకాంక్షలకు, శక్తికి ప్రతిరూపంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళల సాధికారత, అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు దేశ భవిష్యత్ నిర్మాణంలో వారి క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతోపాటు మహిళల సంపూర్ణ సాధికారతే లక్ష్యంగా అఖిల భారత మహిళా కాంగ్రెస్ కృషి చేస్తోందన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ, సమానత్వ సాధన కోసం ప్రతి ఒక్కరూ కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పూజలు

### కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్, 15 (సమయం న్యూస్)** కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు,అనంతరం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళా సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొడంగల్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నలు సంతోషంగా ఉన్నారని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.అలాగే కొడంగల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకోవడమే తన ప్రధాన ఆకాంక్ష అని నందారం ప్రశాంత్ తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కొడంగల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది.



# వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు



### డీజే ఆపరేటర్ల బైండోవర్- పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్

**పెద్దదేముల్ మండలం, సెప్టెంబర్,15(సమయం న్యూస్)**

తాండూరు నియోజకవర్గం పెద్దేముల్: వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే వినాయక శోభాయాత్ర (నిమజ్జనం) సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పెద్దేముల్ మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రతి డీజే ఆపరేటర్‌ను రూ.2,00,000/- పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్‌పై బైం డోవర్ చేయడం జరిగిందన్నారు. వినాయక శోభాయాత్ర సమయంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసినట్లయితే సంబంధిత డీజే యజమాని మరియు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. పండుగను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు మరియు డీజే ఆపరేటర్లు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## అక్కంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన స్థా నిక ఎంపీడీవో



**వలిగొండ సెప్టెంబర్ 15 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అక్కంపల్లి గ్రామాన్ని ఈరోజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి సందర్శించి గ్రామపంచాయతీ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని హాజరు రిజిస్టర్లు, మ్యుటేషన్లు, భవన నిర్మాణ అనుమతి రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులపై ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను స్వయంగా విచారించి వివరాలను మొబైలు అప్ప్ లో నమోదు చేశారు. అక్కంపల్లి గ్రామం నుంచి మొత్తం 8 పెన్షన్ దరఖాస్తులు అందగా, అన్ని దరఖాస్తులపై ఇంటింటి స్థాయిలో విచారణ పూర్తిచేశారు. రేపటి నుంచి వలిగొండ గ్రామంలో పెన్షన్ దరఖాస్తులపై ఇంటింటికీ వెళ్లి విచారణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా VB-G RAM-G పథకం కింద నిర్మించిన సోక్‌పిట్‌ను పరిశీలించి, దాని నిర్మాణం మరియు వినియోగం గురించి వివరాలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని కూడా పరిశీలించి, ఆయా ఇళ్ల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు సేకరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మల కృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రమౌళితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల చరిత్రను భావితరాలకు అందించాలి.

### సంగీశెట్టి క్రిస్ట ఫర్ టి ఏం యు ఎస్ రాష్ట్ర అధ్యక్షులు.



**భువనగిరి సెప్టెంబర్ 15 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన పోరాట యోధుల చరిత్రను భావితరాలకు అందించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రం కోసం జైలునిర్బంధాలు టియర్ గ్యాస్ బాష్ప వాయువు పోలీసులు లాటి దెబ్బలు రబ్బర్ బుల్లెట్ కు ఎదురోడి పోరాడిన పోరాటాల యోధుల చరిత్రను భావితరాలకు అందించడం మన ముందున్న కర్తవ్యం అని క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. సమైక్య పాలకులు ఎన్ని నిర్బంధాలు పెట్టిన సంవత్సరాల కొద్ది పీడీ యాక్ట్ లు పెట్టి న లెక్క చేయని త్యాగధనుల చరిత్రను భావితరాలకు అందించి చరిత్రను లిఖించబడేలా ఉండాలని ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు భార్యా పిల్ల లు మరోవైపు జైలు నిర్బంధాలు కాళ్లు చేతులు విరిగిన లాటిలు విరిగిన రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుల త్యాగాలు వృధా కానివ్వవద్దని క్రిష్టఫర్ డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 15( సమయం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. నార్నూర్ మండలం జామ్డ గ్రామంలో మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి తో కలిసి నూతన గ్రామపంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. మరో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అర్హులైన లబ్ధిదారులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులు నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, రెవెన్యూ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**మెదక్, సెప్టెంబర్ 15( సమయం న్యూస్)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 (SIR)లో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌లో జరుగుతున్న SIR ప్రక్రియను ఆమె పరిశీలించారు.

ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే 2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చాలని సూచించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు.

# యువ ఆపదమిత్ర శిక్షణకు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,15(సమయం న్యూస్)** బీచుపల్లి లోని టి.జి.ఎస్.పి 10వ బెటాలియన్, వద్ద ఈ నెల 16 నుండి 22 వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించే యువ ఆపద మిత్ర పథకం (వై. ఎ. యం. యస్) మొదటి విడత శిక్షణకు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు చెందిన ఐదుగురు ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు వి. సికిందర్, జి. మోహన్, అసిఫ్ పాషా, కె. శివ, ఎస్. మనోజ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యువ ఆపద మిత్ర పథకం అనునది తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఎస్.డి.ఆర్.ఎఫ్ మరియు తెలంగాణ ప్రత్యేక పోలీసు దళం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్. ఎస్.ఎస్ వాలంటీర్ల కు విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందన మరియు సమాజ స్థాయి అత్యవసర నిర్వహణ వంటి విపత్తు నిర్వహణ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ఉద్దేశించబడిన వినూత్న కార్యక్రమమని. ఇది విద్యార్థుల్లో, ధైర్య – సాహసాలు, సమాజ సేవా తత్పరత, విపత్తు నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలలో దోహదపడుతుందన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఇటువంటి ప్రతిష్టాత్మక శిక్షణకు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేసారు అనంతరం ప్రిన్సిపాల్, ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం అధికార్లు డా. ఆర్. శ్రీనివాస్, డా. ఇ . సోమ్లా మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఎంపికైన వాలంటీర్ల ను అభినందించారు.

# ప్రమోషన్ పొందిన పోలీస్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS



**వికారాబాద్, సెప్టెంబర్,15(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఇటీవల ఏ ఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన నారాయణమ్మ, సంగమేష్, అలాగే హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏ ఎస్సైగా పదోన్నతి పొందిన శంకరయ్య, కిష్టయ్య, పండు, జైపాల్ రెడ్డి లు మంగళవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPSని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారిని అభినందిస్తూ, పదోన్నతికి అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.

# " 17 " ను అధికారికంగా నిర్వహించాలి

### బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు



**ఖమ్మం సెప్టెంబర్ 15 : ( సమయం న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా భారత దేశ చరిత్రలోనే చారిత్రాత్మక సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ ప్రాంతం విమోచన పొందిన నేపథ్యంలో ఆరోజు అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ వీర తెలంగాణ పోరాటం, చరిత్రను భావితరాలకు అందకుండా ఓటు బ్యాంకు రాజకీయాలు చెలాయిస్తున్న రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు విమోచన దినోత్సవం నిర్వహించడానికి వెనుకడుగు వేస్తున్నాయని విమర్శించారు. ఆనాటి భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో , తెలంగాణ ప్రజల విరోచీత పోరాటం, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి కారణంగా నిజం నుండి భారత యూనియన్ లో తెలంగాణ ప్రాంతం విలీనమైందని తెలిపారు. భావి పౌరులకు తెలంగాణ ప్రాంత విరోచిత పోరాటం, చరిత్ర, మన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు గురించి వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే విమోచన దినోత్సవాన్ని నిర్వహించడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు ముందుకు వచ్చి 17వ తేదీన అధికారికంగా కార్యక్రమా లను చేపట్టాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు.

# షాబాద్ లో ఘనంగా తిరంగా బైక్ ర్యాలీ

**షాబాద్: సెప్టెంబర్ . 15.(సమయం న్యూస్)** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా షాబాద్ మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం హాజరయ్యారు. నగర్ కూడా నుంచి షాబాద్ మండలంలోని అంబేద్కర్ విగ్రహం వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్లఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం,మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినం ప్రాముఖ్యతను, చరిత్రను ప్రజలకు, కార్యకర్తలకు వివరించారు.

# రోడ్డు కోసం అడిగిన చేతులే..
# చందాలు వేసి గుంతలు పూడ్చాయి..







- **అధికారులు స్పందించక.. రూ.50 వేలు పోగుచేసిన ఆటోడ్రైవర్లు**
- **గుంతల రోడ్డుకు ఆటో డ్రైవర్లే దిక్కు!**
- **ప్రభుత్వం పట్టించుకోదు.. అధికారులు స్పందించరు..**
- **తలాకొంత చందాలు వేసుకుని రోడ్డుపై మొరం పోయించుకుంటున్న ఆటో డ్రైవర్లు**

**నర్సంపేట, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్) :** ప్రజల ప్రయాణానికి నిత్యం ఉపయోగపడే ప్రధాన రహదారి గుంతలమయమైనా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించక.. సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో చివరకు ఆటో డ్రైవర్లే తమ సమస్యను తామే పరిష్కరించుకునే పరిస్థితి ఏర్పడింది. మదన్నపేట రోడ్డు నుంచి కమ్మపెల్లి, చంద్రయ్యపల్లి వరకు రహదారిపై ఏర్పడిన భారీ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడి వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు తెలియక వాహనాలు అదుపుతప్పుతున్నాయని, ఆటోలు దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. ప్రయాణికులను తీసుకెళ్లే సమయంలో గుంతల్లో ఆటోలు పడటంతో ప్రమాదాల భయం వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఇదే రహదారిపై ఆటోలు నడుపుతూ జీవనం సాగించే తమ పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని వారు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ఇక తమ చేతుల్లో ఉన్నంతలో రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. దీంతో ఆటో డ్రైవర్లు తలాకొంత డబ్బు పోగుచేసుకుని రూ.50 వేల వరకు సమకూర్చుకుని, ట్రాక్టర్ల ద్వారా మొరం తెప్పించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. ప్రజలకు సురక్షితమైన రహదారి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అయినప్పటికీ.. తమ కష్టార్జిత డబ్బును ఖర్చు చేసి రోడ్డు గుంతలు పూడ్చుకోవాల్సిన దుస్థితి రావడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'రోజూ ఆటో నడిపితేనే కుటుంబం గడుస్తుంది. పెట్రోల్, వాహనం మరమ్మతులు, ఇంటి



ఖర్చులు అన్నీ చూసుకోవాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ రోడ్డు కోసం మేమే డబ్బులు పోగుచేసుకోవాల్సి వస్తోంది. మా గోడు వినేవారు ఎవరూ లేరు' అంటూ టో డ్రైవర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు గుంతల కారణంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా మొరం పోసుకోవడం వల్ల సమస్య కొంతకాలమే పరిష్కారమవుతుందని, నాణ్యమైన రహదారిని నిర్మించి తమ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గణేష్ మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి: సీఐ శివశంకర్

**నారాయణపేట, సెప్టెంబర్,15(సమయం న్యూస్)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్స్‌ను తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లా డుతూ... గణేష్ మండపాల వద్ద 24 గంటలూ కనీసం ఇద్ద రు నిర్వాహకులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లు, షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పోలీసులు మండపాల వద్ద పాయింట్ బుక్స్ తనిఖీకి వచ్చినప్పుడు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని, విగ్రహాలు, మండపాల వద్ద చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వేళ గణేష్ విగ్రహాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమశిక్షణతో ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. గణేష్ విగ్రహాల శోభాయాత్రలు, ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, ఎవరూ డీజేలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అలాగే



రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ బాక్సులను తప్పనిసరిగా నిలిపివేయాలని, పరిసర కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శబ్ద నియంత్రణ నిబంధనలు పాటించాలని సూచించారు.గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ కోరారు.ఈ తనిఖీల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17.. ముమ్మాటికీ విమోచన దినోత్సవమే

- **చరిత్రను వక్రీకరించే కుట్రలను సహించం... గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు**
- **త్యాగాల చరిత్రను భావితరాలకు అందించాలి**
- **పరకాల, బైరాన్‌పల్లి వీరగాథలను పాఠ్యాంశాల్లో చేర్చాలి**




**వరంగల్, సెప్టెంబరు 15 (సమయం న్యూస్) :** సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలో మరుపురాని ఘట్టమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గౌరవించాలని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించి జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరుగునపరిచే ప్రయత్నాలను సహించబోమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సూచనల మేరకు గంట రవికుమార్ అధ్యక్షతన వరంగల్ చౌరస్తాలోని కె.కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండూ వేర్వేరు చారిత్రక పరిణామాలని తెలిపారు. వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి భిన్నంగా ఉన్నాయన్నారు. 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరిందని పేర్కొన్నారు. ఆ రోజును 'విలీన దినం', 'ప్రజా పాలన దినోత్సవం' వంటి పేర్లతో పిలిచినంత మాత్రాన చారిత్రక ప్రాధాన్యం మారదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించడం సరికాదని విమర్శించారు.

**సాయుధ పోరాటం.. విమోచన ఉద్యమం వేర్వేరు...**

తెలంగాణ సాయుధ పోరాటంలో రైతులు, పేదలు, సామాన్యులు చేసిన త్యాగాలను తాము తక్కువ చేయడం లేదన్నారు. అయితే సాయుధ పోరాటాన్ని సెప్టెంబరు 17 విమోచన ఘట్టానికి ప్రత్యామ్నాయంగా చూపడం సరికాదన్నారు. సెప్టెంబరు 17 తర్వాత కూడా సాయుధ పోరాటం కొనసాగిన విషయాన్ని గుర్తుచేశారు. పరకాల, భైరాన్‌పల్లి వంటి ఘటనలు తెలంగాణ చరిత్రలో వీరగాథలని, వాటిని పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నిజాం, రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అధికారికంగా స్మరించాలని కోరారు.

**బీజేపీ డిమాండ్లు...**

సెప్టెంబరు 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని, హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలను వేర్వేరుగా పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. పరకాల, భైరాన్‌పల్లి ఘటనలను భావితరాలకు పరిచయం చేయాలని, విమోచన చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌షా, జలగం రంజిత్‌రావు, కుసుమ సతీష్, సిద్ధం నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



### తీవ్ర దుమారం రేపుతున్న

# స్పోర్ట్స్ యాప్ యాడ్

**న్యూయార్క్:** అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టాడు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.



### వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన

# ఆసీస్ కుర్రాడు

**జింబాబ్వేపై మ్యాట్ రెన్‌షా తొలి వన్డే శతకం**

**94 బంతుల్లో 109 పరుగులతో విధ్వంసం**

**ఏడు ఫోర్లు.. మూడు సిక్సర్లతో మెరుపులు**

**107కే నాలుగు వికెట్లు పడినా ఆసీస్‌కు అండ**

**ప్రపంచకప్ ముందు ఆరో స్థానానికి కొత్త ఆశ**

**హరారే, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** టెస్టుల్లో నిరాశపరిచాడు.. వన్డేల్లో మాత్రం బ్యాట్‌తో సమాధానం చెప్పాడు! మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసినా బంగ్లాదేశ్‌పై ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా.. జింబాబ్వేపై తొలి వన్డే శతకంతో చెలరేగిపోయాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో 94 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 109 పరుగులు సాధించి ఆసీస్‌కు భారీ స్కోరు అందించాడు. ఆస్ట్రేలియా టాపార్డర్ విఫలమవడంతో ఒక దశలో 107 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో 18వ ఓవర్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రెన్‌షా జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఆరంభంలో పరిస్థితులకు అనుగుణంగా ఆడిన అతడు ఆ తర్వాత భారీ షాట్లతో స్కోరు వేగాన్ని పెంచాడు.

#### బ్రాడ్ ఎవాన్స్ ఓవర్‌లో సెంచరీ

బ్రాడ్ ఎవాన్స్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రెన్‌షా తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. రెన్‌షా మెరుపులతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పుపై కసరత్తు చేస్తున్న ఆస్ట్రేలియాకు రెన్‌షా ఇన్నింగ్స్ కొత్త ఆశలు కలిగించింది. ముఖ్యంగా ఆరో స్థానంలో దూకుడుగా ఆడగల బ్యాటర్‌గా అతడు తన అవకాశాలను బలపరుచుకున్నాడు. తొలి వన్డే సెంచరీతో అదరగొట్టిన రెన్‌షా ఇక జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసియా క్రీడల్లో 'యంగ్ పవర్'




- వైభవ్ నుంచి అలెగ్జాండ్రా ఈలా వరకు యువ సంచలనాలు
- స్విమ్మింగ్‌లో యు జిడి.. ఒహాషిపై భారీ అంచనాలు
- జావెలిన్‌లో పతిరాగేకు స్వర్ణావకాశాలు
- జిమ్నాస్టిక్స్‌లో నిషియామా సత్తా చాటేనా?
- టెన్నిస్‌లో బంగారమే లక్ష్యంగా ఈలా బరిలోకి

**నాగోయా, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఆసియా క్రీడల సమరానికి జపాన్‌లోని నాగోయా-ఐచి వేదిక సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ మెగా క్రీడా సంగ్రామంలో అనుభవజ్ఞులతోపాటు యువ సంచలనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న ఆరుగురు యువ క్రీడాకారులు ఈసారి పతకాలపై కన్నేశారు. చైనా స్విమ్మర్ యు జిడి నుంచి భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, ఫిలిప్పీన్స్ టెన్నిస్ తార అలెగ్జాండ్రా ఈలా వరకు వీరి ప్రదర్శనపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

#### పదమూడేళ్లకే కొలనులో సంచలనం

చైనాకు చెందిన యు జిడి అతి చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో సంచలన ప్రదర్శనలతో దూసుకొచ్చింది. 2025 ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల వయసులోనే 4ఐ200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్యం సాధించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. వ్యక్తిగతంగా మూడు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాలు చేజార్చుకుంది. ఈ ఏడాది మార్చిలో 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అమెరికా ఒలింపిక్ ఛాంపియన్ రెగన్ స్మిత్‌ను ఓడించింది. ఆసియా క్రీడల్లో 200 మీటర్ల బటర్‌ఫ్లైతోపాటు 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో బరిలోకి దిగనుంది. వచ్చే నెలలో 14 ఏళ్లు పూర్తి చేసుకోనున్న యు జిడి భవిష్యత్‌లో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

#### జావెలిన్‌లో పతిరాగే పవర్

శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరాగే ఈ ఏడాది జావెలిన్ త్రోలో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించాడు. డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన తొలి శ్రీలంక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూన్ 4న రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్లు విసిరి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. గత నెల జ్యూరిచ్‌లో 92.07 మీటర్లతో మరోసారి 92 మీటర్ల మార్కును దాటాడు. ఈ ఘనతను రెండుసార్లు అందుకున్న చరిత్రలో నాలుగో ఆటగాడిగా నిలిచాడు. ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ స్టార్ అర్షద్ నదీమ్ నుంచి అతడికి ప్రధాన పోటీ ఎదురుకానుంది. 92.97 మీటర్లతో ఆసియా రికార్డు నదీమ్ పేరిట ఉన్నప్పటికీ ప్రస్తుతం అతడి ఫామ్‌పై సందేహాలు ఉన్నాయి. భారత స్టార్ నీరజ్ చోప్రా గాయం కారణంగా బరిలో లేకపోవడంతో పతిరాగే స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నాడు.

#### సొంతగడ్డపై ఒహాషి జోరు

జపాన్‌కు చెందిన 17 ఏళ్ల షిన్ ఒహాషి స్విమ్మింగ్‌లో కొత్త తరం స్టార్‌గా ఎదుగుతున్నాడు. 169 సెంటీమీటర్ల ఎత్తున్న ఒహాషి తనకు జంక్‌ఫుడ్ అంటే ఇష్టమని చెప్పడం విశేషం. అయితే కొలనులో మాత్రం అతడి వేగం ప్రత్యర్థులకు సవాల్‌గా మారుతోంది. ఈ ఏడాది 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో చైనా స్టార్ క్విన్ హైయాంగ్ ప్రపంచ రికార్డుకు సెకను కంటే తక్కువ తేడాతో చేరుకున్నాడు. అదే ప్రదర్శనతో జూనియర్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో క్విన్ హైయాంగ్‌తో మరోసారి అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాడు.

#### వైభవ్ బ్యాట్ పేలుతుందా?

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు ఉన్నాయి. పురుషుల టీ20 క్రికెట్‌లో ఆసియా క్రీడల టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తున్న భారత్‌కు వైభవ్ కీలక ఆటగాడిగా మారనున్నాడు.

ఐపీఎల్ 2026లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన వైభవ్.. ఆ ప్రదర్శనతో ఇంగ్లండ్ పర్యటనకు భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే రెండు సిక్సర్లు బాదాడు. అనంతరం జింబాబ్వేపై 18 బంతుల్లో తొలి టీ20 అంతర్జాతీయ అర్ధసెంచరీ సాధించాడు. ఆ తర్వాత 49 బంతుల్లో 81 పరుగులతో మరో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లోనూ అతడి బ్యాట్ నుంచి అలాంటి మెరుపులనే అభిమానులు ఆశిస్తున్నారు.

#### జిమ్నాస్టిక్స్‌లో నిషియామా మెరుపులు

జపాన్‌కు చెందిన 16 ఏళ్ల మిసా నిషియామా సీనియర్ స్థాయిలోకి అడుగుపెట్టిన వెంటనే తన ప్రతిభతో ఆకట్టుకుంది. 2025లో జూనియర్ ఫ్లోర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అనంతరం ఎన్‌హెచ్‌కే ట్రోఫీలోనూ స్వర్ణం సాధించింది. చిన్నతనంలో బ్రెజిలియన్ జియు--జిట్సుపై ఆసక్తి చూపిన నిషియామా ఐదేళ్ల వయసులో జిమ్నాస్టిక్స్ శిక్షణ ప్రారంభించింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో జపాన్‌కు పతకం అందించాలన్నది ఆమె లక్ష్యం. 1964 తర్వాత ఈ విభాగంలో జపాన్‌కు పతకం దక్కకపోవడంతో ఆమెపై భారీ ఆశలు ఉన్నాయి.

#### ఈలా గురి.. ఈసారి బంగారమే

ఫిలిప్పీన్స్‌కు చెందిన అలెగ్జాండ్రా ఈలా టెన్నిస్‌లో యువ సంచలనంగా ఎదుగుతోంది. ఈ ఏడాది తొలి డబ్ల్యూటీఏ టైటిల్‌ను సాధించడంతోపాటు వింబుల్డన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గత నెల వాషింగ్టన్ టైటిల్ సాధించే క్రమంలో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగులాను ఫైనల్లో ఓడించింది. నవోమీ ఒసాకా, ఎలీనా స్విటోలినా, లేలాహ్ ఫెర్నాండెజ్, జెంగ్ క్విన్‌వెన్ వంటి ప్రముఖులపైనా విజయాలు సాధించింది. కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ 18వ ర్యాంకుకు చేరుకున్న ఈలా.. గత హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 18 ఏళ్ల వయసులోనే కాంస్యం సాధించింది. సెమీఫైనల్లో జెంగ్ చేతిలో ఓడిపోయిన ఆమె ఈసారి ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో ఉంది. గత ఏడాది సీ గేమ్స్‌లోనూ స్వర్ణం సాధించిన ఈలా.. ఇప్పుడు ఆసియా క్రీడల బంగారంపై గురిపెట్టింది.

# ఆసియా కప్ దెబ్బకు ర్యాంకింగ్స్ తారుమారు!

- అగ్రస్థానంలో తెలుగమ్మాయి శ్రీ చరణి
- 804 పాయింట్లతో మరింత పటిష్టం
- రెండో ర్యాంకుకు దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్‌లో షెఫాలీకి ఆరో స్థానం
- ర్యాంకింగ్స్‌లో భారత అమ్మాయిల జోరు



**దుబాయ్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఆసియా కప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. మహిళల ఆసియా కప్--2026లో అద్భుతంగా రాణించిన భారత క్రికెటర్లు తాజా ర్యాంకింగ్స్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా తెలుగమ్మాయి ఎన్. శ్రీ చరణి బౌలింగ్‌లో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగా.. దీప్తి శర్మ రెండో స్థానానికి దూసుకెళ్లింది. శ్రీలంకతో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో శ్రీ చరణి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆమె అంతర్జాతీయ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 804 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకుంది. ఈ ప్రదర్శనతో కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్న శ్రీ చరణి.. భారత మహిళల క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచిన దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగమించింది. నాలుగు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. దీంతో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలి రెండు స్థానాల్లో భారత బౌలర్లే నిలవడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆసియా కప్‌లో పరుగుల వరద పారించిన షెఫాలీ.. కీలక మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్‌తో భారత్‌కు బలంగా నిలిచింది. స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచింది. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ షెఫాలీ వర్మ దూసుకెళ్తూ కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకుంది. ఆసియా కప్ ట్రోఫీని సొంతం చేసుకోవడమే కాకుండా.. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో భారత క్రీడాకారిణులు అగ్రస్థానాల వైపు దూసుకెళ్లడం టీమిండియా ఆధిపత్యాన్ని చాటుతోంది.



# నయనతార కంబ్యాక్ ఇస్తుందా?

## 'మహాశక్తి'పైనే ఆశలు!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్) :** తనదైన లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో సౌత్ ఇండియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లేడీ సూపర్ స్టార్ నయనతార, ప్రస్తుతం విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'టాక్సిక్', 'హాయ్' చిత్రాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోవడంతో ఆమె సక్సెస్ ట్రాక్ కాస్త మందగించింది. యష్ సరసన 'టాక్సిక్'లో అక్క గంగ పాత్రలో కనిపించినా, కవిన్‌తో చేసిన ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ 'హాయ్' రొటీన్ కథతో కమర్షియల్ బూస్ట్ ఇవ్వలేకపోయాయి. దీంతో వరుసగా రెండు పరాజయాల తర్వాత ఆమె నటిస్తున్న 'మహాశక్తి' సినిమాపై అంచనాలతో పాటు తీవ్రమైన ఒత్తిడి కూడా నెలకొంది. గతంలో 'మూకుతి అమ్మన్' (తెలుగులో 'అమ్మోరు తల్లి') చిత్రంలో అమ్మవారి పాత్రలో నయనతార మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఫ్రాంచైజీకి సీక్వెల్‌గా 'మూకుతి అమ్మన్ 2'ను తెలుగు ప్రేక్షకులకు 'మహాశక్తి' పేరుతో అందిస్తున్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డివైన్ ఫ్యాంటసీ, యాక్షన్, భారీ వీఎఫ్ఎక్స్ తో రూపుదిద్దుకుంటోంది. రెజీనా విలన్‌గా, దునియా విజయ్, యోగిబాబు, ఊర్వశి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ విజువల్స్ ఆకట్టుకున్నప్పటికీ, కథా బలంతో పాటు విఎఫ్ఎక్స్ క్వాలిటీయే ఈ సినిమా భవితవ్యాన్ని తేల్చనున్నాయి. మరి ఈ భక్తిరస ఫ్యాంటసీ చిత్రంతో నయనతార గ్రాండ్ కంబ్యాక్ ఇస్తుందో లేక హ్యాట్రిక్ డిజాస్టర్ ఆమె ఖాతాలో చేరుతుందో వేచి చూడాలి.

# కిరీటం మిస్సయినా.. 'గూగుల్'లో మళ్లీ బిజీ!

## విధుల్లో చేరిన మిస్ యూనివర్స్ ఇండియా ఫైనలిస్ట్

## గూగుల్ క్లౌడ్‌లో ఇంజనీర్‌గా ఉమాంగ్ కుమావత్

**బెంగళూరు, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఇటీవల జైపూర్‌లో ముగిసిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' అందాల పోటీల్లో ఫైనలిస్ట్‌గా నిలిచిన ఉమాంగ కుమావత్ మళ్లీ తన దినచర్యలో బిజీ అయిపోయారు. పోటీల్లో టైటిల్ దక్కకపోయినా ఆ బాధను పక్కనపెట్టి, బెంగళూరులోని గూగుల్ క్లౌడ్ (+శీశీస్త్రశ్రీవ జశ్రీశీబ) ఆఫీస్‌లో ఐటీ ఇంజనీర్‌గా తన విధుల్లో తిరిగి చేరారు. సెప్టెంబర్ 14న ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న 'డే ఇన్ మై లైఫ్' వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఆఫీస్‌లో పనిచేయడం, వెల్‌నెస్ సెంటర్‌లో వర్కవుట్లు, కాఫీ బ్రేక్స్ వంటి దృశ్యాలతో కూడిన ఈ వీడియో చూసి ఆఫీస్ సహచరులు, నెటిజన్లు ఆమె ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తున్నారు.

ఇదిలా ఉండగా, జైపూర్‌లోని జీ స్టూడియోలో జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' గ్రాండ్ ఫినాలేలో కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో విజేతగా నిలిచారు. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది సుందరీమణులను వెనక్కి నెట్టి కజియా ఈ టైటిల్‌ను సొంతం చేసుకోగా, మాజీ మిస్ యూనివర్స్ ఇండియా మనిక విశ్వకర్మ ఆమెకు కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రతినిధ్యం వహించిన గూగుల్ ఇంజనీర్ ఉమాంగ కుమావత్, టైటిల్ సాధించలేకపోయినా కార్పొరేట్ లైఫ్‌కు తిరిగొచ్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.








# 2న ప్రేక్షకుల ముందుకు 'అనకాపల్లి' చిత్రం!

భవ్య శ్రీ మూవీ మేకర్స్ మరియు నక్కిన నెరేటివ్స్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అనకాపల్లి' సినిమా విడుదలకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన మరియు కాంద్రేగుల నాయుడు కీలక పాత్రలు పోషిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా నిర్మించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాంద్రేగుల కుమార్ రాజా కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ, కథ మరియు స్క్రీన్‌ప్లే రూపకల్పనలో తన వంతు సహకారం అందించారు.

# వినాయక చవితికి 'ఫీల్ మై లవ్' స్పెషల్ ట్రీట్

## ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** వినాయక చవితి సందర్భంగా 'ఫీల్ మై లవ్' చిత్రబృందం ప్రేక్షకులకు ప్రత్యేక కానుక అందించింది. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకంపై నిర్మాత బాలాజీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి వినాయక చవితి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రధాన తారాగణమంతా కనిపించేలా రూపొందించిన పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోందని చిత్రబృందం పేర్కొంది. యువతతోపాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రేమ, కామెడీ, భావోద్వేగాల సమాహారంగా ఈ ఫీల్‌గుడ్ చిత్రాన్ని దర్శకుడు హరి ప్రకాష్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్‌కు మంచి స్పందన లభించిందని, తాజాగా పండుగ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని మేకర్స్ తెలిపారు. ఆదిత్య భాస్కర్, ఐరా, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. మధుసుదన్‌రావు, రాజయ్యప్ప, నోబెల్ జేమ్స్, ప్రియాంక తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథతోపాటు విజువల్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ చెన్నై, పుదుచ్చేరి, మున్నార్, కొడైకెనాల్ వంటి సుందరమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. లొకేషన్లు, ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది. సినిమా ప్రచార కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలో ఆడియో విడుదల వేడుక వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రేక్షకులను నేరుగా కలవాలని నిర్ణయించారు.

# టాలీవుడ్‌కు గుడ్ బై

## అను ఇమ్మాన్యుయేల్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్:** నాని హీరోగా వచ్చిన 'మజ్ను' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టి, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ వంటి అగ్ర కథానాయకుల సరసన నటించిన మలయాళ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్ సినిమాలకు తాత్కాలికంగా గుడ్‌బై చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. అందం, అభినయం ఉన్నప్పటికీ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడం, వరుస పరాజయాలు ఎదురుకావడంతో ఆమె పరిశ్రమకు దూరమవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌ను వీడి తన స్వస్థలమైన అమెరికాలోని చికాగోకు శాశ్వతంగా వెళ్లిపోయినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం అల్లు శిరీష్ సరసన 'ఊర్వశివో రాక్షసివో' చిత్రంలో బోల్డ్ పాత్రలో మెప్పించినప్పటికీ ఆమెకు ఆశించిన అవకాశాలు రాలేదు. ఆ తర్వాత తమిళంలో కార్తి సరసన చేసిన 'జపాన్' చిత్రం కూడా డిజాస్టర్ కావడంతో అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. మెగా కాంపౌండ్‌లోని పలువురు హీరోలతో కలిసి నటించినా కాలం కలసి రాలేదు. అమెరికాలోనే పుట్టి పెరిగిన అను ఇమ్మాన్యుయేల్, అక్కడ తన కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో వచ్చిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఆమె చివరి తెలుగు చిత్రంగా నిలిచింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యం . రైతు సంక్షేమం ..

### జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి ...



**రాయపోల్ సెప్టెంబర్ 15.** రైతు నేస్తం కార్యక్రమంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (NMNF) పథకంలో భాగంగా రైతులకు ఫార్మర్స్ కిట్ల పంపిణీ సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (NMNF) పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (NMNF) పథకంలోని రైతులకు అందించే ఫార్మర్స్ కిట్లను గౌరవ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేందర్ మోహన్ గారు గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన అనంతరం, రాయపోల్ మండలంలో సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి స్వరూప రాణి గారి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని తెలిపారు. రైతులు జాతీయ పకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించాలని సూచించారు, హాజరైన రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. సహజ వ్యవసాయం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని పెంపొందించి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మరియు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రధాన లక్ష్యం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, స్థానిక వనరులతో సహజ పద్ధతిలో వ్యవసాయం చేయడం అని వారు రైతులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహజ వ్యవసాయ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఎందుకు ముఖ్యమైనది అని రైతులకు ఈ క్రింది విధంగా వివరించారు

**రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంది.**

రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. నేల సారం, నీటి నిల్వ సామర్థ్యంమెరుగుపడుతుంది. దీర్ఘకాలంలో స్థిరమైన దిగుబడులు పొందవచ్చు. ఆరోగ్యానికి రసాయన అవశేషాలు తక్కువగా ఉన్న ఆహారం లభిస్తుంది. ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఆహారం తీసుకునే అవకాశం పెరుగుతుంది. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. నేల, నీరు, గాలి నాణ్యత మెరుగుపడుతుంది అని సూచించడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమంలో జీవామృతం, బీజామృతం, నిమాస్త్రం, అగ్నియాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ విధానాలు, వాటి వినియోగం, సహజ వ్యవసాయంలో అనుసరించాల్సిన మెళకువలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగింది. అదే విధంగా ప్రభుత్వం బోనస్ ఇస్తున్న 7 వరి సన్న రకాలు సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొన్న విత్తన డీలర్స్ వద్ద 17/09/2026 లోపు నమోదు చేసుకోవాలి అని లేదా రైతు సొంత ఇంటి విత్తనాలతో పండిస్తే స్వీయ దృవీకరణ ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలి అని సూచించారు. అదే విధంగా ప్రస్తుతం జిల్లా లోని అన్ని గ్రామాలలో డిజిటల్ విధానంలో క్రాప్ బుకింగ్ జరుగుతుంది కావున రైతు సోదరులు అందరూ పంట నమోదు చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఆరేపల్లి సర్పంచ్ దివ్య కృష్ణ . ఏఎంసీ/ఆత్మ డైరెక్టర్లు మల్లేష్, జాని గౌడ్, ఏఈఓలు రజిత, శిరీష మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- ఆధారాలతో నోటీసులకు సమాధానం ఇవ్వాలి..
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు... తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్



**నర్సంపేట, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్) :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం నాలుగో విడతలో జారీ చేసిన నోటీసుల ప్రక్రియ నర్సంపేట పట్టణంలో వేగవంతమైంది. నోటీసులు అందుకున్న పలువురు ఓటర్లు మంగళవారం వాసవి కళ్యాణ మండపానికి చేరుకుని, సంబంధిత ఆధార పత్రాలను జతచేసి నోటీసులకు సమాధానాలను అందజేశారు. బీఎల్ఓలు నాయిని సతీష్, రామగిరి మాధవి పరిధిలోని ఓటర్లు తమకు అందిన నోటీసులతో పాటు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించారు. స్థానిక ఆర్ఐ సూపర్‌వైజర్ యూసఫ్ అలీ పర్యవేక్షణలో ఈ పత్రాలను ఎమ్మార్వో ఎల్. రవి చంద్రరెడ్డికి అందజేశారు. అదేవిధంగా తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, ఆయన సతీమణి అజ్గర్ సుల్తానాకు కూడా ఎన్నికల సంఘం నుంచి నోటీసులు జారీ అయ్యాయి. దీంతో వారు వాసవి కళ్యాణ మండపానికి చేరుకుని, తమకు అందిన నోటీసులకు అవసరమైన ఆధార పత్రాలను జతచేసి ఎమ్మార్వోకు సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ జావిద్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నుంచి నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఆందోళన చెందకుండా, నోటీసులో కోరిన వివరాలకు సంబంధించి తగిన ఆధార పత్రాలను జతచేసి ఎమ్మార్వోకు సమర్పించాలని సూచించారు. నోటీసులు అందని వారు తమ పరిధిలోని బీఎల్ఓలను సంప్రదించి తమ పేర్లకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయా లేదా తెలుసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి పరిష్కరించుకోవాలని జావిద్ సూచించారు.

# సన్న ధాన్యం విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలి

### సెప్టెంబరు 18లోగా ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాలి



**ఆలేరు, సెప్టెంబర్ 15(సమయం న్యూస్):** ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న వరి రకాల సాగు చేస్తున్న రైతులు తమ విత్తనాల వివరాలను సెప్టెంబరు 18వ తేదీలోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆలేరు సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల సూచించారు. సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల ధాన్యానికి కొనుగోలు సమయంలో క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించనున్న నేపథ్యంలో రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. గొలనుకొండ గ్రామంలో సన్న వరి పంటను, డిజిటల్ క్రాప్ సర్వేను సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, జైశ్రీరాం రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద పట్టా దారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో వెళ్లి విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన వారు, అలాగే సొంత విత్తనాలతో సన్న వరి సాగు చేస్తున్న రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించి తమ పంట వివరాలను నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో ప్రైవేటు సర్వేయర్ల ద్వారా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల వివరాల నమోదు వల్ల ప్రభుత్వ పథకాలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ప్రయోజనాలు పొందేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజయ్యతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో బీర్ల దంపతుల గిరిప్రదక్షిణ

### స్వాతి నక్షత్రం సందర్భంగా సామూహిక గిరిప్రదక్షిణ





**ఆలేరు, సెప్టెంబర్ 15(సమయం న్యూస్)**: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో మంగళవారం నిర్వహించిన సామూహిక గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన సతీమణి బీర్ల అనితతో కలిసి పాల్గొన్నారు. గిరిప్రదక్షిణకు ముందు వైకుంఠ ద్వారం వద్ద ఉన్న స్వామివారి పాదాలకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రార్థించి ఆలయ క్షేత్రం, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, వేలాది మంది భక్తులతో కలిసి యాదాద్రి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు యాదాద్రి క్షేత్రానికి తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. దీంతో యాదాద్రి కొండ చుట్టూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గిరిప్రదక్షిణ అనంతరం బీర్ల ఐలయ్య దంపతులు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా వారికి స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆశీస్సులతో ఆలేరు నియోజకవర్గ ప్రజలు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ స్వామివారి కృప లభించాలని కోరుకున్నారు.

కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథులకు రెండో వార్డు కౌన్సిలర్ ప్రత్యేక పూజలు



**కొడంగల్, సెప్టెంబర్,15(సమయం న్యూస్)** కొడంగల్ పట్టణ కేంద్రంలోని రెండో వార్డు తెలంగ్‌వాడిలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నందిశ్వర వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కొడంగల్ మున్సిపాలిటీ లోని రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ–మధుసూదన్ యాదవ్ దంపతులు తొలి పూజ నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి ఆశీస్సులు పొందారు. అనంతరం కూరగాయల మార్కెట్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడిని, తెలంగ్‌వాడిలో గ్యాంగ్ స్టర్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని కౌన్సిలర్ దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అలాగే ఆవుసుల పరమేష్ ఇంటి వద్ద, బసవన్న కట్ట వద్ద ప్రతిష్ఠించిన గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు కౌన్సిలర్ దంపతులకు స్వాగతం పలికారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు.

## అగా ఖాన్-Vతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్:సెప్టెంబర్16( సమయం న్యూస్)**తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–Vతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణలో అగా ఖాన్ ఫౌండేషన్ సేవలను సీఎం ప్రశంసించారు. శాసనమండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్ పునరుద్ధరణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా సిటీ కాలేజ్, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణకు సహకరించాలని కోరారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–Vను సీఎం ఆహ్వానించారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు సమ్మిట్‌కు హాజరవుతారని తెలిపారు. 30 వేల ఎకరాల్లో నెట్–జీరో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని, అందులో 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నామని సీఎం వివరించారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## వై ఎస్ సి ఏ గణేశుడి వద్ద ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు.



**వలిగొండ సెప్టెంబర్ 15 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో వై ఎస్ సి ఎ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడు వద్ద ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో విగ్రహ దాత గంగాపురం సతీష్ గౌడ్ కల్పన, జాల వలిభాష, పల్సం రాజు, కొండూరు అంజయ్య, గంగాపురం బుచ్చిబాబు, వెల్లంకి కొండలు, పబ్బు స్వామి, రచ్చ గణేష్, కొండూరు సాయి, పబ్బు వెంకన్న, కొండూరి భాస్కర్, ఆజాం, బిక్షపతి పబ్బు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్ల కాపర్ల సంఘం అధ్యక్షుడిగా వటిపల్లి లక్ష్మణ్



**ఆలేరు, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఆలేరు మున్సిపాలిటీ ఆరో వార్డు బహదూర్‌పేటకు చెందిన వటిపల్లి లక్ష్మణ్ గొర్ల కాపర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వటిపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ గొర్ల కాపర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గొర్ల కాపర్ల సంక్షేమం కోసం సంఘంలోని సభ్యులందరినీ కలుపుకొని ఐక్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తానని చెప్పారు.

## వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: ఎంపీ కడియం కావ్య



**జనగామ, సెప్టెంబర్ 15(సమయం న్యూస్):** జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధి దారునికి సకాలంలో చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని వరంగల్ ఎంపీ, దిశా కమిటీ ఛైర్పర్సన్ కడియం కావ్య ఆదేశించారు. మంగళవారం జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో వివిధ శాఖల పథకాల అమలు, పురోగతిని ఆమె సమీక్షించారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిషేధిత పారక్వాట్ గడ్డి మందు వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, విద్యార్థుల్లో రక్తహీనత, మానసిక సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేపడుతున్న కార్యక్రమాలను ఎంపీ అభినందించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పాల ఉత్పత్తి, చేపల పెంపకాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు పెంచాలని, నెల్లు ట్లచెరువులోకి మురుగునీరు చేరకుండా ఎస్టీపీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోం, ప్రజాప్రతినిధులు, దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చరిత్రను భావితరాలకు చాటాలి.. సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలి

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గొగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**నర్సంపేట, సెప్టెంబరు 15 సమయం న్యూస్) :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నర్సంపేట ఆర్డీవో ఉమారాణికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గొగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న నిజాం, రజాకార్ల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. కొమురం భీమ్, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రరెడ్డి తదితరుల పోరాటం, వందలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఈ విముక్తి సాధ్యమైందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 17ను 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఇది రాజకీయాలకు అతీతమైన అంశమని, తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సెప్టెంబరు 17న నర్సంపేట డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించాలని, విమోచన పోరాట అమరవీరులకు నివాళులు అర్పించేలా అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ జూలూరి రోజారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు జూలూరి మనీష్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు అంబేత్కర్, నల్లబెల్లి అధ్యక్షుడు తడక వినయ్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిసా విఘ్నేష్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 15:** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను శంషాబాద్ విద్యాశాఖ మంగళవారం ఘనంగా సత్కరించింది. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) లక్ష్మణ్ నాయక్ గారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి ప్రకాష్ గౌడ్ జిల్లా స్థాయిలో విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన ఆరు మంది జిల్లా అవార్డు గ్రహీతలను ,20 మంది మండల ఉత్తమ ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు శాతం పెంచిన సాతంరాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యయుని మరియు రిటైర్డ్ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని,సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా మరింత మంది స్ఫూర్తి పొందుతారని అన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు,పాఠశాలల అభివృద్ధి,ఉత్తమ ఫలితాల సాధనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో చేసిన కృషిని గుర్తిస్తూ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా రెడ్డి, ఎంపీడీవో మున్ని, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి , మోహన్ రావు,బాల స్వామి, మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాల్ రెడ్డి,వీరమల్లేష్,భాస్కర్, బాలరాజ్ మరియు వివిధ సంఘాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు ,మండల ఉపాధ్యాయులు ,మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ అపూర్వ సమ్మేళనం



**ఖమ్మం, సెప్టెంబర్ 15 : ( సమయం న్యూస్ )** జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి , ఐదవ తరగతి నుండి పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి విద్యార్థినీలు... ( 1989 – 99 ) తమ సెయింట్ జోసెఫ్ హై స్కూల్ వేదికగా ఆదివారం నాడు ఆత్మీయ అపూర్వ సమ్మేళనం నిర్వహించుకొని , తమ జ్ఞాపకాల మధుర క్షణాలను నెమరు వేసుకున్నారు. తమ ఉపాధ్యాయులను కలుసుకున్న వేళ , ఆనందంతో, ఉద్వేగంతో మరోసారి పాఠశాల అనుభవాలను గుర్తు తెచ్చుకున్నారు. నిర్వాహకులు రామకృష్ణ ,శేఖర్, ఉష, ఫణి కుమార్, క్రాంతి, శ్రావ్య, శరత్, జోగయ్య లు ఈ కార్యక్రమాన్ని తమ భుజాన వేసుకొని , తలపెట్టగా శైలజ యాంకర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జూలైట్, సి బి ఎస్ సి హెచ్ ఎం. జ్యోత్స్న , ఉపాధ్యాయులు సుశీల, బాల భారతి లు మాట్లాడుతూ తమ విద్యార్థులు జీవితంలో ఎదగటం తమకు ఎంతో ఆనందంగానూ గర్వకారణంగా ఉందన్నారు. ఎదగటం, స్థిరపడటం క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగించే విధంగా తాము ఉపాధ్యాయులుగా నిర్వహించిన తమ పాత్ర సఫలీకృతం కావడం ఉపాధ్యాయ వృత్తి కారణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులుగా తమ జన్మ సార్ధకమైందన్నారు. నేర్పిన క్రమశిక్షణ, నేర్పించిన విలువల ఆధారంగా తమ జీవితాలను తీర్చిదిద్దుకున్న విద్యార్థులు, విద్యార్థినిలు ఇదే స్ఫూర్తితో ఇతరులకు కూడా స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థి , సమ్మేళన నిర్వాహకుడు కె. రామకృష్ణ మాట్లాడుతూ అందంగానూ, అత్యద్భుతంగాను కనిపించే శిలలు మనలను ఎంతో ఆకట్టుకుంటూ కనిపిస్తుంటాయి. వాటి వెనుక శిల్పి మనకు కనిపించడు. అతని శ్రమ కూడా మనకు కనిపించదు. అదేవిధంగా ఉపాధ్యాయుల పాత్ర కూడా. కనిపించకుండా మనలను తీర్చిదిద్దుతుంటాయి. మన గమనం ను మన గమ్యాలను నిర్దేశిస్తుంటాయి. మనం జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి , సమాజంలో పేరు ప్రఖ్యాతలు గావించినా, వాటి వెనుక ఉండే మన గురువు గొప్పతనం కూడా ఎవరికి తెలియదన్నారు. మన ఎదుగుదల లో నిత్యం కనిపించే,వినియోగించుకునే జ్ఞానం గురువుల వరం అన్నారు. మరో నిర్వాహకుడు శేఖర్ మాట్లాడుతూ చిన్నతనంలో అలవడే అలవాట్లు పెద్దయ్య కా కూడా మనలో కొనసాగుతుంటాయని తెలుపుతూ మనం చిన్నప్పటి నుండి క్రమశిక్షణ, మంచి నడవడిక వంటి అలవాట్లను నేర్చుకుంటే అవి మన ఎదుగుదలకు ఉపయోగపడతాయి అన్నారు. ఇలాంటి శిక్షణను మనకు అందజేసిన గురువులు మనకు సదా స్మరణీయులని తెలిపారు. పూర్వ విద్యార్థిని ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ తరగతి గదులలో నేర్చుకున్న అక్షరాలు భావి జీవితంలో అభివృద్ధి బాటలు వేస్తాయని చెబుతూ ఉదాహరణగా పూర్వ విద్యార్థులమైన తమ జీవితాలు ఏ విధంగా సమగ్రతను సాధించాయో వివరించారు. అక్షరాలు కేవలం అక్షరాలు కాకుండా తమకు భవిష్యత్తులో ఎలా బ్రతకాలో వివరించడమే కాకుండా మంచి చెడులను విపులీకరించడంలో మార్గదర్శకత్వం వహించాయని వెల్లడించారు. వీటి వెనుక తమ ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందన్నారు.మరో పూర్వ విద్యార్థిని భవాని మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు తమకు జన్మనిస్తే గురువులు తమ జన్మకు ఒక అర్థాన్ని ఒక పరమార్థాన్ని కల్పించారని వివరించారు. ఇలాంటి గురువులు తమకు లభించడం తమ అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అహర్నిశలు పాటుపడిన నిర్వాహకుడు కే. రామకృష్ణ ను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ అభినందనలు ప్రకటించారు. పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరడం, తమ జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం .... ఒక మధురానుభూతిని కలిగించడం వెనుక రామకృష్ణ పడ్డ శ్రమ ప్రశంసనీయమని పలువురు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థి, విద్యార్థినీలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సుశీల, పి ఈ టి రమణ, సరోజిని, ఫాతిమా, అంతోనమ్మ, కల్పన ,శశికళ, నిర్వాహకులు ఉష, ఫణి కుమార్, శరత్, క్రాంతి కుమార్, శ్రావ్య, శైలజ ,విజయ, సత్యవాణి జోగయ్య లతోపాటు పూర్వ విద్యార్థి విద్యార్థినీలు రంజిత్, ఫరీద్, జగ్గయ్య, హాఫీస్, సుధీర్, జీలాని, రామారావు, ఆవుల ఉపేందర్, కలీం, వినీత, రాజేష్, శ్రావణి, ప్రవీణ, కోటేశ్వరి, డి. సునీత, జి. విజయ రాణి, బిందు, పద్మజా, ఇందిరా, సుమ, శ్రీలత, బి. నాగమణి, నాగలక్ష్మి, వసంత రాణి, పి. విజయలక్ష్మి, మంజు, డి. విజయలక్ష్మి, మనీ, సరిత, కె. విజయలక్ష్మి, సౌజన్య, ఏ. విజయ రాణి,నాగరత్నం, రవికిరణ్, ఎస్. విజయ లక్ష్మి, మమత,భారతి, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తులు కాదు.. తల్లిదండ్రులకు ఆత్మీయత కావాలి

- **వృద్ధాప్యం ఎవరికీ శాపం కాకూడదు**
- **తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే...నేరెళ్ల వెంకట హైమ పూజిత, డా.అనితా రెడ్డి**



**హనుమకొండ, సెప్టెంబరు 15 (సమయం న్యూస్) :** తల్లిదండ్రులను గౌరవించడం, వారి బాధ్యతను చూసుకోవడం పిల్లల కర్తవ్యమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి నేరెళ్ల వెంకట హైమ పూజిత, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డా. అనితారెడ్డి అన్నారు. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమంలో వృద్ధుల పోషణ, రక్షణ చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజిత, డా. అనితారెడ్డి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం వృద్ధుల చట్టం, ట్రిబ్యునల్ బెంచ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు ఏవైనా సమస్యలు, వేధింపులు ఎదురైతే డీఎల్ఎస్ఏ లేదా ట్రిబ్యునల్ బెంచ్‌ను సంప్రదించాలని సూచించారు. వృద్ధులను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పిల్లలకు ఆస్తులను పూర్తిగా బదలాయించకుండా, తమ అవసరాలకు కొంత ఆస్తిని ఉంచుకోవాలని, తదనంతరం ఆస్తి చెందేలా వీలునామా రాసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల బాధ్యత తీసుకోని పిల్లలకు వారి ఆస్తులు, అధికారాలను కోరే హక్కు లేదన్నారు. వృద్ధులను ప్రేమించి, గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టేవారు ఎంతటి సంపన్నులైనా విలువలేని వారితో సమానమని అన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, సంస్థ నిర్వాహకులు యాకూబ్, శ్రీకాంత్, వృద్ధులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**సామాజికవేత్త కందకంట్ల సిద్దు రెడ్డి**



**శంషాబాద్ సమయం సెప్టెంబర్15:** శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలను సామాజిక సేవకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి మంగళవారం సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన ఆయనకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల భవనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి , వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దురెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను త్వరలోనే తన సొంత ఖర్చులతో కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.సిద్దిరెడ్డి ఇచ్చిన హామీ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన సిద్దిరెడ్డి సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# సఖి సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



**నారాయణపేట, సెప్టెంబర్,15(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న స ఖి (వన్ స్టాప్) సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్‌లోని షెల్టర్ గది, కౌన్సిలింగ్ గది, మీటింగ్ హాల్‌తో పాటు పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి (డీ డబ్ల్యు ఓ) రాజేందర్ గౌడ్‌తో కలిసి సఖి సెంటర్ సిబ్బందితో మాట్లాడి కేంద్రం నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.సెంటర్‌లోని హాజరు రిజిస్టర్, వివిధ రికార్డులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు సఖి సెంటర్ ద్వారా ఎంతమంది బాధితులకు సేవలు అందించారనే వివరాలతో పాటు, గత నెల రోజులుగా ఎంతమంది బాధితులు సెంటర్‌ను ఆశ్రయించారనే సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌కు ఎక్కువగా ఎలాంటి కేసులు వస్తున్నాయని, బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు ఎన్ని నమోదయ్యాయని కలెక్టర్ ప్రశ్నించగా, వివాహాల సీజన్‌లో బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తుంటాయని సెంటర్ బాధ్యురాలు క్రాంతిరేఖ వివరించారు.సఖి సెంటర్‌లో నమోదైన గృహ హింస, లైంగిక దాడులు, వరకట్న వేధింపులు, పోక్సో, అదృశ్యం, అపహరణ, మోసం, ప్రేమ వివాహాలు, ఆశ్రయం కల్పించిన కేసులు, కౌన్సిలింగ్, వైద్య సేవలు, ప్రస్తుతం విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.బాధితులకు సఖి సెంటర్‌లోనే భోజనం అందించేలా కిచెన్ గదిని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే సెంటర్ పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని ఇతర అనువైన ప్రదేశానికి తరలించే అంశంపై డీ డబ్ల్యు ఓ తో చర్చించారు.కోస్గి ప్రాంతం నుంచి వచ్చే బాధితులకు నారాయణపేట కంటే మహబూబ్‌నగర్‌కు చేరుకోవడం సులభంగా ఉంటుందని పేర్కొన్న కలెక్టర్, మహబూబ్‌నగర్ సఖి సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి కోస్గి ప్రాంతానికి చెందిన బాధితులకు అక్కడే అవసరమైన ఆశ్రయం, సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీ డబ్ల్యు ఓ కు సూచించారు.అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC)కి సంబంధించిన కేసుల సంఖ్య, గత రెండు నెలల్లో నమోదైన కేసుల పూర్తి వివరాలను తనకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సఖి సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాధితులకు అవసరమైన సేవలు సత్వరమే అందేలా సఖి సెంటర్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు.